# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక








సంపుటి :12 సంచిక :325 మంగళవారం 28-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


## దేశంలో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..



- ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- రూ.10, రూ.20 పాలిమర్ నోట్లకు కేంద్రం ఆమోదం
- ట్రయల్‌లో వంద కోట్ల చొప్పున నోట్ల విడుదల
- మన్నిక, పనితీరుపై క్షేత్రస్థాయి పరీక్షలు
- విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు
- కాగితపు నోట్ల రద్దు లేదన్న కేంద్రం
- రెండు రకాల నోట్లు సమాంతరంగా చెలామణి
- ముద్రణ ఖర్చు తగ్గింపే కేంద్ర లక్ష్యం
- భారత వాతావరణానికి అనుకూలతపై ఆర్‌బీఐ పరీక్షలు

2

## విజయ్ సర్కార్‌కు షాక్..



- కరూర్ బాధితులకు ఇచ్చిన ఉద్యోగాలు రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు
- ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమన్న ధర్మాసనం
- ఆర్టికల్ 14, 16లకు భంగం కలిగిందని వ్యాఖ్య
- 41 మంది మృతుల కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలపై తీర్పు
- ఇలాంటి నియామకాలు భవిష్యత్‌కు దారితీస్తాయన్న కోర్టు
- ఉద్యోగం సాధించుకోవాలి.. విలువను కాపాడాలి: హైకోర్టు
- సీబీఐ దర్యాప్తుపై వ్యాఖ్యలు చేయని ధర్మాసనం

2



## ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదు

- ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం
- సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యం
- మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్:జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)
తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్ళకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా

-మిగతా 2 లో

## ఢిల్లీలో రేవంత్ బిజీ బిజీ

### నేడు కేంద్ర మంత్రులతో భేటీ



- కార్పొరేషన్ ఛైర్మన్లు & కమిటీల ఏర్పాటుపై చర్చ
- రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు డ కాంగ్రెస్ వ్యూహం
- ప్రతిపక్షాల విమర్శల తిప్పికొట్టాలని అధిష్టానం ఆదేశాలు
- స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం ముందుగా ఖరారు చేసుకోవాలని సూచనా
- క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలుపై జనంలో బహుళ ప్రచారం
- ఏఐసీసీ సమీక్షా సమావేశంలో తెలంగాణ నేతలకు ఆదేశాలు
- సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

న్యూఢిల్లీ జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)
ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కీలక మైలురాళ్లను చేరుకుంటున్న తరుణంలో, ప్రభుత్వ-పార్టీ సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీ, కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధులు-ప్రాజెక్టులు, మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాత్రింబవళ్లు కష్టపడి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులు, కార్యకర్తలకు తగిన న్యాయం చేయాలని కేసీ వేణుగోపాల్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రాష్ట్ర

-మిగతా 2 లో



## ఐదేండ్లలో 4 రెట్లు పెరిగిన బిలియనీర్లు..

- కేంద్ర ప్రభుత్వం వెల్లడి
- రూ.100 కోట్ల ఆదాయం ప్రకటించిన 576 మంది
- పార్లమెంట్‌కు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
- అధిక ఆదాయ వర్గాల సంఖ్యలో భారీ పెరుగుదల
- 'బిలియనీర్' పదానికి ఐటీ చట్టంలో నిర్వచనం లేదు

2



## మూడు షరతులకు ఓకే అంటేనే చర్చలు..

- యూఎస్‌కు స్పష్టం చేసిన ఇరాన్
- స్తంభింపజేసిన నిధుల విడుదలకు తొలి ప్రాధాన్యం
- ఆ తర్వాతే అణు కార్యక్రమంపై చర్చలకు సిద్ధం
- ప్రత్యామ్నాయ మార్గం ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్

ఇరాన్ జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)
అమెరికాతో చర్చల కోసం ఇరాన్ మూడు షరతులను విధించడమే కాకుండా, హెర్ముజ్ జలసంధిగుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను స్పష్టంగా తిరస్కరించింది. మొదట.. హెర్ముజ్ జలసంధిపై చర్చలు ప్రారంభించి, అది పూర్తిగా ఇరాన్ నియంత్రణలోనే ఉన్నదనే విషయాన్ని స్పష్టం చేయాలని టెహ్రాన్ కోరుతున్నది. రెండవది.. స్తంభింపజేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలి. మూడవది..

-మిగతా 2 లో

## మతం మారితే ఎస్సీ హోదా రద్దు:

- క్రిస్టియానిటీ, ఇతర మతాలకు మారితే రిజర్వేషన్లు వర్తించవు
- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- 1950 రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారమే ఎస్సీ హోదా
- మత మార్పుతో ఎస్సీ ప్రయోజనాలు ముగుస్తాయి
- తిరిగి హోదా పొందాలంటే మూడు నిబంధనలు తప్పనిసరి
- పుట్టుక, తిరిగి మత స్వీకరణ, కుల ఆమోదం కీలకం
- రిజర్వేషన్ విధానంపై ప్రభావం చూపనున్న తీర్పు
- మత మార్పిడి అంశంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

2



## మా పెద్దిని కాపాడండి

- ఐసియులో ఉన్న సుదర్శన్‌రెడ్డిని చూసి భావోద్వేగానికి గురైన కెసిఆర్
- యశోద ఆస్పత్రికి వెళ్లి సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసిన ప్రతిపక్ష నేత
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కెసిఆర్

### వైద్యులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేసిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్



హైదరాబాద్:
బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. తీవ్ర గుండెపోటుతో చికిత్స పొందుతున్న బిఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐసియులో ఉన్న సుదర్శన్‌రెడ్డిని చూసి కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు అరగంట సేపు అక్కడే ఉండి డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరును గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు. ప్రస్తుతం సుదర్శన్ రెడ్డికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే విదేశీ

-మిగతా 2 లో




## పార్లమెంట్లో నిరసనల హోరు

- అమిత్ షా క్షమాపణలు చెప్పాల్సిందే
- విపక్షాల నిరసనలు, ఆందోళనలు
- ఉభయ సభల్లో వాయిదాల పర్వాలు
- చర్చకు సహకరించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి
- వెనక్కి తగ్గని ప్రతిపక్షాలు
- స్పీకర్ చొరవతో చర్చకు అంగీకారం
- నేడు లోక్‌సభలో బిల్లుపై చర్చ
- అధికార, విపక్షాల మధ్య కుదిరిన సయోధ్య

న్యూఢిల్లీ, జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)
పార్లమెంట్‌లో నీట్ పై ఆందోళనలు ఆగడం లేదు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినా విపక్షాలు శాంతించడం లేదు. నినాదాలు, నిరసనలతో అట్టుడుకుతున్నాయి. సోమవారం సైతం లోక్‌సభలో గందరగోళం నెలకొంది. విపక్షాలు కేంద్రంపై నిరసన వ్యక్తం చేస్తూ ఉండటంతో సభ వాయిదాలు పడుతూ సాగింది. ఎట్టకేలకు పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి రూపొందించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

-మిగతా 2 లో




## పాలమూరుపై బీఆర్‌ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు

- కృష్ణా, భీమా జలాల వినియోగానికి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది
- ప్లకార్డులతో రాజకీయ డ్రామాలు మానుకోవాలి
- పాలమూరు ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి
- మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్:-జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)
పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కర్ణాటకలో పర్యటిస్తూ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమేనని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామిక్షిభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. కృష్ణా జలాల అంశంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో కర్ణాటకలో ఆనకట్టలు నిర్మిస్తున్న సమయంలో ఒక్కసారి కూడా ప్రశ్నించని

-మిగతా 2 లో

# దేశంలో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..

- ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- రూ.10, రూ.20 పాలిమర్ నోట్లకు కేంద్రం ఆమోదం
- ట్రయల్‌లో వంద కోట్ల చొప్పున నోట్ల విడుదల
- మన్నిక, పనితీరుపై క్షేత్రస్థాయి పరీక్షలు
- విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు
- కాగితపు నోట్ల రద్దు లేదన్న కేంద్రం
- రెండు రకాల నోట్లు సమాంతరంగా చెలామణి
- ముద్రణ ఖర్చు తగ్గింపే కేంద్ర లక్ష్యం
- భారత వాతావరణానికి అనుకూలతపై ఆర్‌బీఐ పరీక్షలు




**న్యూఢిల్లీ,**
దేశంలో త్వరలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ.10, రూ.20 విలువ కలిగిన ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షిద్దామని భారత రిజర్వ్ బ్యాంక్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ లో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఈ ప్రయోగాల్లో భాగంగా రూ.10, రూ.20 డినామినేషన్లలో వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ఆర్బీఐ జారీ చేయనుంది. భారతీయ వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్ల మన్నిక, పనితీరును పరిశీలించడమే ఈ క్షేత్రస్థాయి పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయోగాలు విజయవంతమైతేనే వీటిని దేశవ్యాప్తంగా విస్తృతస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే, ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రవేశపెడుతున్నంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దుచేసే ప్రతిపాదన ఏదీ లేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. కాగితపు నోట్లతో పాటే పాలిమర్ నోట్లు కూడా సమాంతరంగా చెలామణిలో ఉంటాయని మంత్రి వివరించారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయని, ఇవి సులభంగా పాడవవని ఆర్బీఐ పేర్కొన్నది. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోతుండటంతో వాటిని తరచూ మార్చాల్సి వస్తోంది. పాలిమర్ నోట్ల వినియోగంవల్ల ముద్రణ, నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# విజయ్ సర్కార్‌కు షాక్..

- కరూర్ బాధితులకు ఇచ్చిన ఉద్యోగాలు రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు
- ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమన్న ధర్మాసనం
- ఆర్టికల్ 14, 16లకు భంగం కలిగిందని వ్యాఖ్య
- 41 మంది మృతుల కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలపై తీర్పు
- ఇలాంటి నియామకాలు భవిష్యత్‌కు దారితీస్తాయన్న కోర్టు
- ఉద్యోగం సాధించుకోవాలి.. విలువను కాపాడాలి: హైకోర్టు
- సీబీఐ దర్యాప్తుపై వ్యాఖ్యలు చేయని ధర్మాసనం

**న్యూఢిల్లీ,**
తమిళనాడులోని విజయ్ సర్కార్‌కు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలకు టీవీకే విజయ్ సర్కార్ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాల్ని కోర్టు రద్దు చేసింది. ఈ ఉద్యోగాల నియామకం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్‌లో టీవీకే పార్టీ ఆధ్వర్యంలో విజయ్ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు భారీగా జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తానని విజయ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారం చేపట్టిన తర్వాత సీఎం విజయ్ బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్ ఆధ్వర్యంలోని బెంచ్ సోమవారం విచారణ జరిపింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తూ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లను ఉల్లంఘించడమే అని కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ ఇలా బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తే, భవిష్యత్‌లో ఈ తరహా ఉద్యోగాల కేటాయింపునకు ఇది తలుపులు తెరిచినట్లు అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. చాలామంది బాధితులు ఇదే రకంగా ఉద్యోగాల కోసం ఎదురుచూసే పరిస్థితి వస్తుందని హైకోర్ట్ బెంచ్ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ఇలాంటి ఆదేశాలు జారీ చేసేముందు రాజ్యాంగాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. "ఉద్యోగాల్ని రాష్ట్ర ప్రభుత్వం అలా ఇచ్చేయకూడదని, అది కష్టపడి సాధించుకోవాలని, దాని విలువను, గౌరవాన్ని ప్రభుత్వం గుర్తించాలి. చాలామంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు" అని కోర్టు వ్యాఖ్యానించింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ జరుగుతోందని, సుప్రీంకోర్టు కూడా ఈ విచారణను పర్యవేక్షిస్తోందని, అందువల్ల ఈ కేసు విచారణపై మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని కోర్టు తెలిపింది.



# ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదు

మొదటి తరువాయి

అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పోషకాలతో కూడిన అల్పాహారం, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరికాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఢిల్లీలో రేవంత్ బిజీ బిజీ

మొదటి తరువాయి

స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా మరియు మార్కెట్ కమిటీ పదవులను త్వరలోనే భర్తీ చేయాలని నిర్ణయించారు. సామాజిక సమీకరణలు పాటిస్తూ జాబితాను ఆమోదించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం ఐదు గ్యారెంటీల అమలు తీరును రేవంత్ రెడ్డి ఏఐసీసీకి వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ పథకాల ద్వారా ప్రజల్లోకి వెళ్లిన సానుకూల సంకేతాలను చర్చించారు. ప్రభుత్వ లబ్ధిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. త్వరలో జరగనున్న పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు పురపాలక ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పట్టును మరింత బలోపేతం చేసేందుకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నారు.
అలాగే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. రాష్ట్రానికి రావలసిన పెండింగ్ నిధులు, అనుమతులపై కేంద్రంపై ఒత్తిడి తేవడమే ఈ భేటీల ముఖ్య ఉద్దేశం. కేంద్ర హోం మంత్రి అమిత్ షాని కలిసి రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలు, పెండింగ్ ఆస్తుల పంపకాలు, పోలీస్ శాఖ ఆధునీకరణ నిధులపై చర్చించనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కలిసే తెలంగాణ రుణ పరిమితి పెంపు, కేంద్ర పన్నుల వాటా విడుదల, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రత్యేక గ్రాంట్లపై వినతిపత్రం అందజేయనున్నారు. కేంద్ర రహదారులు ఉ రవాణా శాఖ మంత్రితో కలిసి చర్చించనున్నారు. రీజినల్ రింగ్ రోడ్ – ఉత్తర మరియు దక్షిణ భాగాల నిర్మాణం వేగం పెంచడం, భూసేకరణ వ్యయంలో కేంద్ర వాటా స్పష్టత ఈ పర్యటనలో వచ్చే అవకాశం ఉంది. జాతీయ రహదారుల విస్తరణ: హైదరాబాద్ – విజయవాడ, హైదరాబాద్ – శ్రీశైలం, మంచెర్యాల – వరంగల్ జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయడం పై మరోమారు ఆశ్చర్యించనున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి ని కలిసి కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల పరిధి, ప్రాజెక్టులకు జాతీయ హోదా మరియు నిధుల మంజూరుపై మాట్లాడనున్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో లోతుగా చర్చించారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను రాజకీయంగా, అధికారికంగా ఎలా తిప్పికొట్టాలనే దానిపై వ్యూహరచన చేశారు. హైడ్రా ఉ మూసీ పునరుద్ధరణ: హైదరాబాద్ నగర రూపురేఖలు మార్చేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైడ్రా ఆక్రమణల తొలగింపు చర్యలు, మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టులపై ప్రజలకు సరైన వివరణ ఇవ్వాలని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా ఖండించాలని మీనాక్షి నటరాజన్ సూచించారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నూతన డిసిసి అధ్యక్షుల నియమాకాలు, అనుబంధ సంఘాల కమిటీల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయనున్నారు. ఢిల్లీలో జరిగిన ఈ ఏఐసీసీ సమీక్షా సమావేశం తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి నూతన దిశానిర్దేశం చేసింది. ప్రభుత్వ సంక్షేమ–అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేసి కార్యకర్తలను ఉత్సాహపరచడం, కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన హక్కులను సాధించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరియు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని పీసీసీ ముందుకు సాగుతున్నాయి.

# మతం మారితే ఎస్సీ హోదా రద్దు:

- క్రిస్టియానిటీ, ఇతర మతాలకు మారితే రిజర్వేషన్లు వర్తించవు
- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- 1950 రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారమే ఎస్సీ హోదా
- మత మార్పుతో ఎస్సీ ప్రయోజనాలు ముగుస్తాయి
- తిరిగి హోదా పొందాలంటే మూడు నిబంధనలు తప్పనిసరి
- పుట్టుక, తిరిగి మత స్వీకరణ, కుల ఆమోదం కీలకం
- రిజర్వేషన్ విధానంపై ప్రభావం చూపనున్న తీర్పు
- మత మార్పిడి అంశంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ,**
: షెడ్యూల్డ్ కులాల కు చెందిన వ్యక్తి ఇతర మతంలోకి మారితే వారి ఎస్సీ హోదా తక్షణమే రద్దవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మరోసారి స్పష్టంచేసింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను కాదని క్రిస్టియానిటీ లేదా ఇతర మతాలను స్వీకరించిన వ్యక్తులకు ఎస్సీ రిజర్వేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు చెల్లవంటూ గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందిజస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం.. హిందూ, సిక్కు, బౌద్ధ మతస్థులు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని, మతం మారిన మరుక్షణమే ఎస్సీ హోదా, దాని ఆధారిత ప్రయోజనాలు ముగుస్తాయని స్పష్టంచేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి పొరపాటు లేదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. పునఃపరిశీలన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఒకవేళ ఎవరైనా తిరిగి ఎస్సీ హోదాను పొందాలంటే రాజ్యాంగం నిర్దేశించిన మూడు ప్రధాన నిబంధనలకు (పుట్టుకతో ఎస్సీ అయి ఉండటం, స్వచ్ఛందంగా తిరిగి సొంత మతంలోకి రావడం, మూల కుల సమాజం వారిని ఆమోదించడం) కట్టుబడి ఉండాలని ధర్మాసనం పేర్కొన్నది. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ కీలక తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వేషన్ విధానాలు, మత మార్పిడి వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

# పార్లమెంట్లో నిరసనల హోరు

మొదటి తరువాయి




నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాల నినాదాల మధ్య బిల్లును సభ ముందుకు తీసుకువచ్చింది. అయితే విపక్షాల నిరసనలతో ఎలాంటి చర్చ జరగకుండానే ఉభయ సభలు మంగళ వారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికార, విపక్ష సభ్యులతో చర్చించి సయోధ్య కుదిర్చారు. దీంతో మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉన్నట్లుగా కేంద్రం భావిస్తోంది. పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలను లీక్ చేసే వారిని కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా కేంద్రం పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. విపక్షసభ్యుల ఆందోళన మధ్య కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు. ఈ క్రమంలో సభ మొదట 12 గంటలకు తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా విపక్షాలు ఆందోళన కొనసాగించగా స్పీకర్ అధికార, విపక్ష సభ్యులకు 3 గంటల సమయం ఇచ్చారు. విభేదాలు పరిష్కరించుకోవాలని కోరుతూ సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. అయితే తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడం వల్ల సభ మంగళవారానికి వాయిదా పడింది. ఇక రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్ పై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. వారి నిరసనల మధ్య సభ మూడు సార్లు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బిల్లును సభలో ప్రవేశపెట్టి చర్చించేందుకు సభ్యులు సహకరించాలని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సింగ్ కోరినప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో సభ సాయంత్రం 5 గంటల 15 నిమిషాలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్షాలను మరోసారి కోరారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ విషయంలో హోంమంత్రి ప్రకటన చేయాలని విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. సభకు వచ్చి ఆయన క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. దీంతో అనంతరం ఉపాధ్యక్షుడు హరివంశ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

# ఐదేండ్లలో 4 రెట్లు పెరిగిన బిలియనీర్లు..

-కేంద్ర ప్రభుత్వం వెల్లడి
-రూ.100 కోట్ల ఆదాయం ప్రకటించిన 576 మంది
-పార్లమెంట్‌కు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
-అధిక ఆదాయ వర్గాల సంఖ్యలో భారీ పెరుగుదల
-'బిలియనీర్' పదానికి ఐటీ చట్టంలో నిర్వచనం లేదు



**న్యూఢిల్లీ,**
దాదాపు 576 మంది వ్యక్తులు 2025–26 మదింపు సంవత్సరానికి సంబంధించి తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ స్థూల ఆదాయాన్ని ప్రకటించారని, ఇది గత ఐదేండ్లలో నాలుగు రెట్ల పెరుగుదల అని సోమవారం ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలియచేసింది. దేశంలో బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఇందులో ప్రపంచంలోని అగ్రగామి దేశాలలో భారత్ ఒకటిగా ఉందనే విషయం ప్రభుత్వానికి తెలుసా అన్న ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ బిలియనీర్ అనే పదానికి ఆదాయ పన్ను చట్టం–1961 ప్రకారం నిర్వచనం ఏదీ లేదని తెలిపారు.

# మూడు షరతులకు ఓకే అంటేనే చర్చలు..

మొదటి తరువాయి



ఈ రెండు అంశాలు పరిష్కారమైన తర్వాతే ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై చర్చించాలి.
మైన్‌ను ఢీకొని పేలిన ఆయిల్ ట్యాంకర్
హెర్ముజ్ జలసంధిలో ఆదివారం ఒక ఆయిల్ ట్యాంకర్ సముద్రపు మందుపాతరను ఢీకొని పేలిపోయిందని ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ నివేదించింది. ఆ నౌక వివరాలు, దానిలోని సరుకు, ప్రాణనష్టం వివరాలను వెల్లడించలేదు.

# మా పెద్దిని కాపాడండి

మొదటి తరువాయి

నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని వైద్యులు కేసీఆర్‌కు వివరించారు. ఐసియులో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం అనంతరం కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు... భార్య స్వప్న, కొడుకు నిదర్శన్ రెడ్డి, కూతురు ధరిత్రి, అన్నలు శ్రీనివాసరెడ్డి రవీందర్ రెడ్డి, చెల్లె స్వాతి తదితరులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.
దాదాపు 45 నిమిషాల పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కేసీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... "మీరేం చేస్తారో చేయండి.. కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ వైద్యులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. డాక్టర్లకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు. కాగా.. అమెరికా తదితర విదేశాల నుంచి అవసరమైన సలహాలు తీసుకుంటూ, అత్యున్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యవస్థలతో, సీనియర్ డాక్టర్లతో చికిత్సను అందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు.
కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, వినోద్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
పలువురు నేతల పరామర్శ
యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి సీతక్క, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, బిజేపి ఎంపి ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు అందించిన చికిత్స వివరాలను డాక్టర్లు కేటీఆర్‌కు వివరించారు. అన్ని రకాల మెరుగైన చికిత్స అందించాలని కేటీఆర్ ప్రత్యేకంగా డాక్టర్లకు విజ్ఞప్తి చేశారు. పెద్ది కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు.


# పాలమూరుపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు

మొదటి తరువాయి

నాయకులు ఇప్పుడు ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. జూరాల పరివాహక రైతులు, ముంపు గ్రామాల సమస్యలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజ్–కమ్–బ్రిడ్జిల నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు విజయవంతమయ్యాయని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే కార్యాచరణ ప్రారంభమైందన్నారు. భూత్పూర్, నేడుగం, అనుగొండ, అంకెనపల్లి, దాదంపల్లి గ్రామాల అభివృద్ధితో పాటు భూత్పూర్ డ్యామ్ విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ముఖ్యంగా యువత, రైతులు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొంటూ, "మంచి చేయలేకపోయినా చెడు చేయకండి.. ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు" అని మాజీ ప్రజాప్రతినిధులకు మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు

# జెన్ జెడ్ ప్రశాంతమైన మనసుతో ఆలోచించలేదు

**న్యూఢిల్లీ:జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
జనరేషన్ జెడ్ గురించి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారు. జెన్ జెడ్ అనేది అనుకరణీయమైందని, భావోద్వేగమైందని, కానీ ఆ యువత ప్రశాంతమైన మనసుతో ఆలోచించలేరని అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన విశ్వమాంగ్య సభలో ఆయన మాట్లాడారు. కానీ జెన్ జెడ్‌లకు ఏది కనిపించినా అది వారికి తగినట్లు ఉంటుందని అన్నారు. ప్రామాణికంగా, సంబంధం ఉన్నట్లుగా అనిపించే ఉద్యమాలకు, ఐడియాలకు యువత ప్రభావితం అవుతుందని మోహన్ భగవత్ అన్నారు. సోషల్ మీడియా ఆధారంగా యువత తాజాగా జరిగిన విద్యార్థుల ఆందోళనలో పాల్గొన్న విషయం తెలిసిందే.తన ప్రసంగంలో మహిళా విముక్తి గురించి




కూడా మోహన్ భగవత్ మాట్లాడారు. స్త్రీ ముక్తి ఆందోళన చాలా నెమ్మదిగా విస్తరించిందని, దశలవారీగా ఆ ఉద్యమం లఆగిందన్నారు. సమానత్వం, విద్య, ఉద్యోగం, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, రక్షణ, న్యాయపరమైన హక్కుల విషయాలపైన మాత్రమే మహిళా హక్కుల ఉద్యమాలు సాగినట్లు ఆయన చెప్పారు. ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీ గురించి ఆయన మాట్లాడుతూ.. భారతీయ సమాజంలో వాళ్లు భాగమే అని, వారిని వేరు చేయలేమన్నారు. కొందరిలో ఎల్జీబీటీ లక్షణాలు సహజంగా ఉంటాయని, కానీ కొందరు తమ మైండ్‌సెట్ కారణంగా వాటిని పొందుతున్నారన్నారు. కానీ ఈ విధానం ప్రపంచవ్యాప్తంగా ఉందని, ఇక్కడ లేదని మనం అనలేమన్నారు. మనమూ మనుషులమే అని, దీన్ని కూడా విస్తరిస్తున్నట్లు చెప్పారు. పెళ్లి ద్వారా క్రమశిక్షణ వస్తుందని, దాని ద్వారా ధర్మాన్ని ఆచరించే వీలు ఉంటుందని మోహన్ భగవత్ అన్నారు. కానీ లివిన్ రిలేషన్‌లో ఉన్న అనర్థాలను ప్రపంచం అంతా గమనిస్తూనే ఉందని ఆయన అన్నారు.

# ఉక్రెయిన్‌కు తగిన శాస్తి చేస్తాం..

## ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

**న్యూఢిల్లీ:-జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
కాస్పియన్ సముద్రంలో ప్రయాణిస్తున్న తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ బలగాలు జరిపిన దాడిలో ఒక నావికుడు ప్రాణాలు కోల్పోగా, మరో నావికుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ దాడిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ భద్రతను ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఎంతటి కఠిన చర్యలకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ చర్యకు పాల్పడిన ఉక్రెయిన్‌కు రాబోయే రోజుల్లో తగినశాస్తి జరుగుతుందని, యుద్ధం మరింత ముదరకుండా చూడాలంటే కీవ్ వైఖరిని ఐరోపా దేశాలు వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేసింది.పశ్చిమాసియాలో



ఇప్పటికే యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తమకు రష్యా-ఉక్రెయిన్ పోరుతో ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ పదేపదే చెబుతున్నప్పటికీ.. రష్యా నుంచి ఇరాన్ శాటిలైట్ సమాచారాన్ని పొందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలు అమెరికా మిలిటరీ స్థావరాలపై రష్యా సేకరించిన ఉపగ్రహ చిత్రాలను ఇరాన్ తన దాడుల కోసం వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన ఆంక్షలవల్ల చైనా తదితర దేశాల నుంచి వస్తువుల రవాణాకు ఇరాన్‌కు ఈ కాస్పియన్ సముద్ర మార్గమే దిక్కుగా మారింది. అలాంటి కీలకమైన దారిలో నౌకపై దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. ఇదిలావుంటే ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తోపాటు చెర్నిహివ్, ఖార్కివ్ నగరాలపై రష్యా ఆదివారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా ఏడు బాలిస్టిక్ మిస్సైళ్లు 136 ఆత్మాహుతి డ్రోన్లతో రష్యా వైమానిక దాడికి తెగబడినట్లు ఉక్రెయిన్ ఆర్మీ వెల్లడించింది. ఈ దాడిలో ఆరుగురు అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

# గుడ్ న్యూస్ చెప్పిన ఇండియన్ ఆయిల్..

## -బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్ డెలివరీ

**న్యూఢిల్లీ::-జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కొత్త సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ ' పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్ ను ప్రవేశపెట్టడంతోపాటు బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే డెలివరీ చేసే సేవను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవను ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది.సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే కొత్త 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉంటుంది. దాంతో దాన్ని మోయడం, తరలించడం, వినియోగించడం మరింత సులభమవుతుందని ఇండియన్ ఆయిల్ తెలిపింది. గృహ వినియోగంతోపాటు చిన్న వ్యాపార అవసరాలకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నది.



బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్‌ను ఇంటికే అందించేలా కొత్త సేవను రూపొందించింది. ఈ సేవలో వినియోగదారులకు మరికొన్ని సౌకర్యాలు కూడా కల్పించారు. తమకు అనుకూలమైన డెలివరీ సమయాన్ని ఎంచుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంలో సులభంగా బుక్ చేసుకునే సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. దాంతో గ్యాస్ బుకింగ్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా మారుతుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ఈ కొత్త సేవ అందుబాటులో ఉంది. వినియోగదారుల స్పందనను బట్టి త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వెల్లడించింది. అలాగే 5 కిలోల ఇండేన్ చోటూ సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ సేవను విస్తరించింది. చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఎక్కువగా వినియోగించే ఈ సిలిండర్‌ను కూడా త్వరగా అందించేలా చర్యలు తీసుకుంది.

# అధిక కెఫీన్ కలిగిన ఆ పానీయాలకు ఎనర్జీ డ్రింక్ అనే పదం వాడొద్దు


**న్యూఢిల్లీ::జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్ గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కీలక ఆదేశాలు జారీచేసింది. పెప్సీ, రెడ్ బుల్ , మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది.భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని FSSAI పేర్కొన్నది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది.




బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీచేసింది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్-ఎస్ఏఐ సీఈవో రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది. యూరోమానిటర్ అంచనాల ప్రకారం.. 2028 నాటికి భారత ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ విలువ 1.6 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది.

# అమెరికాలో కాల్పుల కలకలం..

**న్యూఢిల్లీ::-జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
అమెరికాలో మరోసారి తుపాకీ కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. సియాటెల్ నగరంలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలో అత్యంత వైభవంగా జరుగుతున్న "బైట్ ఆఫ్ సియాటెల్" ఫుడ్ ఫెస్టివల్ వేదికగా ఈ హింసాత్మక ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా ఆందోళన రేకెత్తిస్తోంది. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. సియాటెల్‌లోని



ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో ఈ కాల్పులు జరిగాయి. గాయపడిన వారిలో రెండేళ్ల బాలుడు కూడా ఉన్నట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన భద్రతా దళాలు ఘటనా స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడిన విషయాన్ని పోలీసులు అధికారికంగా ప్రకటించారు. పరిస్థితి దృష్ట్యా ప్రజలెవరూ ఆ ప్రాంతానికి రావద్దని హెచ్చరికలు జారీ చేశారు.

# ఇస్రోలో 244 ఖాళీలు




**న్యూఢిల్లీ::జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
ఇస్రోకు చెందిన వివిధ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 244 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అసిస్టెంట్ 130, అప్పర్ డివిజన్ క్లర్క్ 81, స్టెనోగ్రాఫర్ 10, జూనియర్ పర్సనల్ అసిస్టెంట్ 82 ఖాళీలు ఉన్నాయి. ఈ ఉద్యోగాల్లో హైదరాబాద్‌లో 15, ఏపీలో 49 ఉన్నాయి.

**అర్హతలు**
అసిస్టెంట్, యూడీసీ పోస్టులకు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు లేదా 6.32 సీజీపీఏతో ఉత్తీర్ణులై ఉండాలి. దీంతో పాటు కంప్యూటర్‌లో పరిజ్ఞానం ఉండాలి. జూనియర్ పర్సనల్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు డిగ్రీ లేదా కమర్షియల్/సెక్రటేరియల్ ప్రాక్టీస్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వీటితో పాటు స్టెనో-టైపిస్ట్/స్టెనోగ్రాఫర్‌లో సంవత్సరం అనుభవ, ఇంగ్లిష్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. ఆగస్టు 16 నాటికి 28 ఏండ్లు నిండి ఉండాలి. ఓబీసీలకు 31, ఎస్సీ, ఎస్టీలకు 33 ఏండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**దరఖాస్తు ఫీజు**
దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి. రూ. 500 దరఖాస్తు ఫీజు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళలకు ఎలాంటి ఫీజు లేదు.

**ఎంపిక, జీతం**
రాత పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 25,500ఇతర అలవెన్సులు ఇస్తారు.

**చివరితేదీ**
ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు జూలై 27 నుంచి ప్రారంభమయ్యాయి. ఆగస్టు 16లోగా దరఖాస్తు చేసుకోవాలి. న్యూఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, హసన్, శ్రీహరికోట, అహ్మదాబాద్, తిరువనంతపురం, మహేంద్రగిరిల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. దరఖాస్తు, ఇతర వివరాలకు వెబ్‌సైట్ https://www.isro.gov.in/లో చూడవచ్చు


# అయోధ్య విరాళాల చోరీ కేసు..

## - రెండు వారాల్లో నివేదిక సమర్పించాలన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:-జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
అయోధ్య రామాలయం విరాళాల చోరీ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులను ఆదేశించింది. ఈ బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని పేర్కొన్నది. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తంచేసింది.ఆలయ విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిపై స్పందిస్తూ.. ప్రస్తుతం తమ దృష్టి అంతా దర్యాప్తుపైనే ఉందని వ్యాఖ్యానించింది. సిట్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసం ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టింది. యూపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.సిట్ అధికారులు, యూపీ పోలీసులు ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారని.. దర్యాప్తులో తేలిన విషయాలను త్వరలో ధర్మాసనం దృష్టికి తీసుకువస్తామని కోర్టుకు వివరించారు. కాగా ఈ కేసును సీబీఐ, కాగ్‌తో విచారణ జరిపించాలని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

# లాగులో మూత్రం పోసుకున్నాడని బాలుడి మర్మాంగంపై వాతలు పెట్టిన టీచర్..!



**న్యూఢిల్లీ::జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
నర్సరీ విద్యార్థి పట్ల ఓ టీచర్ అమానవీయంగా ప్రవర్తించింది. లాగులో మూత్రం పోసుకున్నాడన్న కోపంతో.. కూరగాయలు కోసే కత్తిని వేడిచేసి ఆ బాలుడి మర్మాంగం పై వాతలు పెట్టింది. మూడు రోజుల క్రితం వారణాసిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టీచర్‌పైన, పాఠశాలపైన కేసు నమోదైంది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కేసరి జైస్వాల్ కుమారుడు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ప్లే స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత నొప్పిగా ఉందని తల్లికి చూపించాడు. వాతలు ఉన్నట్లు గమనించిన తల్లి.. భర్తకు ఈ విషయం చెప్పింది. ఆ మర్నాడు స్కూలుకు వెళ్లి ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదు. దాంతో జైస్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు వాష్ రూమ్‌కు వెళ్తానని టీచర్‌ను అడిగినా..ఆమె పంపలేదని, మూత్రం నిక్కర్లో పోసేశాడని, అందుకు కోపగించిన ఆమె.. పక్క రూమ్‌కు తీసుకెళ్లి.. వాతలు పెట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ఇది అత్యంత తీవ్రమైన చర్య అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# దోమలను అరికడదాం సీజనల్ వ్యాధులను నివారిద్దాం

## జె. శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 27 (జర్నలిస్ట్ డైరీ)** ఈరోజు చించోడు గ్రామ పంచాయితీలో, చించోడు గ్రామ సర్పంచ్ రాకాల శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఫరక్ నగర్ మండల్ ఎంపీడీవో శ్రీకాంత్ గారు హాజరయ్యారు. ఈ గ్రామ సభలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు తెలియజేశారు. వర్షాకాలంలో వాతావరణంలో తేమ పెరగడం వలన, నీరు నిల్వ ఉండడం వలన, దోమలు మరియు ఈగలు ఎక్కువగా పెరుగుతాయని, వీటి వలన అనేక సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని, ఇలాంటి సమయంలో గ్రామ ప్రజలు పరిశుభ్రత పాటించకపోతే, వివిధ రకాల వ్యాధులు త్వరగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉంటుందని జె. శ్రీనివాసులు చెప్పారు. దోమలలో అనాపిలిస్ దోమ, క్యూలెక్స్ దోమ మరియు ఏడీస్ దోమ వంటి దోమల వలన మలేరియా వ్యాధి, ఫైలేరియా వ్యాధి, డెంగు వ్యాధి మరియు చికెన్ గునియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అన్నాఫ్లీజ్ దోమ కొట్టడం వలన మలేరియా జ్వరం వస్తుంది అని, ఈ జ్వరం చలి వణుకుతో కూడి ఉంటుందని, తలనొప్పి, చెమటలు పట్టడం, అలసట ఒంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల బోదకాల వ్యాధి వస్తుందని, ఈ వ్యాధి లక్షణాలు తరచుగా జ్వరం రావడం, శోష రస గ్రంధులు వాపు రావడం, చేతులు లేదా కాళ్ళ మీద వాపు రావడం, పురుషులలో వృషణ సంచి వాపు రావడం , చర్మం మందంగా, గరుకుగా మారడం , వ్యాధి తీవ్రమైన స్థితిలో ఏనుగుకాలుగా మారుతుందని చెప్పారు. లేడీస్ దోమ కుట్టడం వలన డెంగు జ్వరం వస్తుందని, డెంగు లక్షణాలు అధిక జ్వరము తీవ్రమైన తలనొప్పి కల్ల వెనుక నొప్పి కండరాలు కీళ్ల నొప్పులు చర్మంపై ఎర్రటి దద్దుర్లు రావడం, ప్లేట్ లేట్స్ తగ్గిపోవడం జరుగుతుందని జె.శ్రీనివాసులు తెలియజేశారు. పైన తెలిపిన వ్యాధులకు వివిధ లక్షణాలు కనబడిన వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకుని వ్యాధి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే వైద్యుని సలహాతో తగిన చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. వర్షాకాలంలో ఈగల వలన నీరు మరియు ఆహారము కలుషితం అయినప్పుడు, కలుషితమైన ఆహారం నీరు త్రాగడం వలన మనిషికి తరచూ విరేచనాలు, వాంతులు, నీరసము, డిహైడ్రేషన్ ఏర్పడుతాయని చెప్పారు. ఇలాంటప్పుడు ఆ వ్యక్తికి ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని, సురక్షితమైన నీరు మాత్రమే తాగించాలని , వైద్యుని సలహాతో తగిన చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. వర్షాకాలంలో పాటించవలసిన జాగ్రత్తలు ఏంటి అనగా.

ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండనివ్వకండి, తాగు నీటిని మరిగించి లేదా శుద్ధి చేసి తాగవలనని, తాజా , వేడి ఆహారమే తీసుకోవాలని, భోజనము ముందు మరియు మరుగుదొడ్డి తర్వాత చేతులను సబ్బుతో కడుక్కోవాలని, దోమతెరలు దోమ నివారణ చర్యలు పాటించాలని, జ్వరము రెండు రోజుల కంటే ఎక్కువ ఉంటే లేదా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని హెల్త్ ఎడ్యుకేటెడ్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫరూక్నగర్ ఎంపీడీవో శ్రీకాంత్ , గ్రామ సర్పంచ్ రాకాల శ్రీనివాస్, డిప్యూటీ సర్పంచ్ కే రాజేందర్ రెడ్డి, విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, డి.పి.ఎమ్.ఓ వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు ఉమామహేశ్వర నాయక్, సంతోష్ నాయక్, యాదగిరి , రామచంద్రయ్య, ఆశాలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీ వారి నిర్లక్ష్యం.. వాహనాల నుంచి రోడ్డు పై పడుతు చెత్త....



**నాగారం, జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)** మునిసిపాలిటీ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యంతో రోడ్లు చెత్తగా మారిపోతున్నాయి. మునిసిపాలిటీ చెత్త వాహనాలు అతివేగంగా వెళ్లుతుండటంతో వాహనాల నుండి చెత్త కింద పడుతుండటంతో వెనక వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తడి చెత్త కవర్లు ఒక్కసారిగా కింద పడుతుండటంతో వారి మీద పడటంతో తీవ్రమైన ఇబ్బందికి గురి అవున్నారు. దీనికి ఉదాహరణకు ఈ ఫోటోలో కనిపిస్తుందే. ఇది అంతా మున్సిపల్ లారీ నుంచి కింద పడింది పెద్ద శబ్దంతో కింది పడటంతో అది ఏంటో అని దగ్గరికి వెళ్లి చూస్తే దాంట్లో పెద్ద కూర కనిపిస్తుంది, మున్సిపల్ కార్మికులు సిబ్బంధి ఉడ్చి మూడు నుంచి నాలుగు గంటలు అవుతుంది. నాగరం ఎస్వి నగర్, ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా సోమవారం జరిగింది.

## కాలనీ వాసుల విజ్ఞప్తితో తుమ్మచెట్లు తొలగింపు....



**నాగారం, జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)** కాలనీలోని ఖాళీ స్థలాలో పెరిగి పిచ్చి మొక్కలతో విషసర్పాలు తిరుగుతూ ఇబ్బందిగా మారాయని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి స్పందించి సోమవారం వాటిని జేసిబి(ఎక్స్కవేటర్)తో తొలగించారు.నాగారం డివిజన్ పరిధిలోని వికాస్ నగర్ కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు, ఎంవైఆర్ గార్డెన్స్ ఎదురుగా, సెరెనిటీ మోడల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రజలు విచ్చలవిడిగా చెత్త వేయడం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను గుర్తించిన నాగారం డివిజన్ ఆయన సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి, మున్సిపల్ సిబ్బందితో కలిసి జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి, ట్రాక్టర్ ద్వారా చెత్తను డంపింగ్ యార్డ్కు తరలించి సమస్యను పరిష్కరించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు సమస్యను వెంటనే పరిష్కరించిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ సమరశంఖం

**-అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన పోరాట కమిటీ**
**-జీవో 641 రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తాం**
**-షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 27 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమం మరింత ఉధృతమవుతోంది. సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన తొలి సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐతో పాటు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**జీవో 641 రద్దు చేయాలని డిమాండ్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్దాపూర్ గ్రామంలో ఎకో పార్క్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు జూలై 2న జీవో 641ను తీసుకువచ్చిందని జేఏసీ నాయకులు తెలిపారు. జీవో జారీకి ముందే సిద్దాపూర్ గ్రామ ప్రజలు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టి, పెద్ద ఎత్తున చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే శంకరయ్య డంపింగ్ యార్డును రానివ్వబోమని హామీ ఇచ్చారని, అయితే ఆయన హామీ ఇచ్చిన వారం రోజులకే జీవో రావడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జీవో 641ను రద్దు చేసే వరకు ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి, ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకువస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**డంపింగ్ యార్డుతో ప్రజలకు తీవ్ర నష్టం: జేఏసీ**

జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్ అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో నాయకులు గ్రామ ప్రజలకు డంపింగ్ యార్డు వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టే ప్రతి కార్యక్రమంలో గ్రామ ప్రజలు భాగస్వాములై ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. జీవో 641 రద్దు అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ప్రజల కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటా: అంజయ్య యాదవ్**

సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ పరిశ్రమల ఏర్పాటుకు భూములు సమీకరించామని, ప్రస్తుత ప్రభుత్వం అదే ప్రాంతాన్ని డంపింగ్ యార్డు కోసం కేటాయించడం దారుణమని అన్నారు.

ప్రజల కోసం పనిచేసే ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు ఏ కార్యక్రమం చేపట్టినా వారి వెంట నడుస్తానని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు ఏర్పాటైతే సిద్దాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు చేపట్టిన ఈ పోరాటంలో విజయం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు.

**జేఏసీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

అనంతరం సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్ను నాయకులు ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసి, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యాచరణ రూపొందిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.

పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు

ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, రాజవరప్రసాద్, కో–చైర్మన్లు దొడ్డి శ్రీనివాస్, ఎమ్మె సత్యనారాయణ, బొజ్జా శ్రీనివాస్ రెడ్డి, వడ్డె బాలయ్య, రజిత నాయక్, బుద్దల జంగయ్య, ఈశ్వర్ నాయక్, రవీంద్రనాథ్, టి.జి. శ్రీనివాస్, అర్జున్, శ్రీకాంత్, ఆకాశ్ నాయక్, పెంటనోళ్ల నర్సింహ, బచ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లెల వెంకట్ రెడ్డి, ఈట గణేష్, వంకాయల నారాయణ రెడ్డి, కోస్గి శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, రవీందర్తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సిద్దాపూర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవాలయం, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి బిఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత.



**యాచారం (జులై 27) జర్నలిస్ట్ డైరీ.** నక్కర్త మేడిపల్లి గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలంటూ నక్కర్త--మేడిపల్లి గ్రామ ప్రతినిధులు హైదరాబాద్లో బిఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు రాంరెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నక్కర్త హనుమాన్ దేవాలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం స్టేజి నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.

గ్రామస్తుల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన రాంరెడ్డి, నక్కర్త హనుమాన్ దేవాలయ నిర్మాణ పనుల కోసం 500 బస్తాల సిమెంట్ అందజేస్తానని ప్రకటించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అవసరాల దృష్ట్యా స్టేజి నిర్మాణానికి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.రాంరెడ్డి ఇచ్చిన హామీలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, గ్రామాభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ సహాయం గ్రామ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు, మాజీ వార్డు సభ్యుడు దేంది సురేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ సింధం అంజయ్య, వైస్ చైర్మన్ బండ రాజు, కలకండ అంజయ్య, పి.ఆర్.జి ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త, శ్రీశైలం, సింధం శ్రీశైలం, రాజు, కొంగల యాదగిరి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నీ నో పై రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలి

## విత్తన మేళాను ప్రారంభించి స్టాళ్లను పరిశీలించిన కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, జులై 27 (జర్నలిస్ట్ డైరీ) :** ఎల్ నీ నో ప్రభావం వల్ల రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ .సత్య శారద అన్నారు. వరంగల్ జిల్లా నల్ల బెల్లి మండలం మేడపల్లి రైతు వేదికను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ సూచనలు అందిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా పంట సాగు విధానాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. రైతులు పంట మార్పిడి, ఆరుతడి పంటల సాగుపై వ్యవసాయ శాఖతో పాటు ,సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రైతులు ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు .గుర్తింపు పొందిన సంస్థల విత్తనాలనే కొనుగోలు చేయాలని, కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తన మేళా ను కలెక్టర్ ప్రారంభించి, స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ కంఠం నివాసితులకు రెవెన్యూ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

**- కలెక్టర్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



నాగారం, జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ) మల్కాజ్గిరి కార్పొరేషన్ కీసర సర్కిల్‌లోని చంద్రపురి కాలనీ డివిజన్ మరియు జవహర్ నగర్ డివిజన్ పరిధిలో గ్రామ కంఠం భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్న ప్రజలకు రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ని కలిసి, గ్రామ కంఠం ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న కుటుంబాలు అధికార పరమైన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని కోరారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కి వివరించారు. ప్రజల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా నిరంతరం వారి తరఫున పోరాడుతామని తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు శాంతి కోటేశ్వర్ గౌడ్, జిల్లా నాయకులు కల్లేపల్లి సదానంద్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు ముదిరాజ్, సీనియర్ నాయకులు రజిత గోపాల్, వినయ్ కుమార్, ప్రేమల శ్రీనివాస్, జి. కృష్ణ గౌడ్ , గండి సునీత, లత, జోగి సునీత, భాస్కర్, సాయి కృష్ణ, మాధవ రెడ్డి, శ్రీనివాస్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

**-రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్**
**-విత్తన మేళాలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు**
**-వెల్‌జర్లలో ఘనంగా విత్తన మేళా**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 27 (జర్నలిస్ట్ డైరీ) ; తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెల్‌జర్ల గ్రామ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలను పరిశీలించి, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సేవలు, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి ఆహ్వానించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, భరత్ లహోటి, వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్, కొండన్నగూడ గ్రామ సర్పంచ్ అనురాధ సురేష్ గౌడ్, వెల్‌జర్ల గ్రామ ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి, ఏఓ నిశాంత్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, ఏఈఓలు గోవర్ధన్, తేజ్‌కుమార్, వినయ్, రాంబాబు, హెచ్‌ఈఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్‌జర్ల గ్రామ నాయకులు కటికెల తిరుపతి యాదవ్, జాంగారి రవి, జాంగారి జంగయ్య, దాస్య నాయక్, దొడ్డి రామదాసు, వార్డు సభ్యులు వెంకటయ్య నాయక్, పవన్ ముదిరాజ్, వట్టెల ప్రవళిక, మహేష్ యాదవ్, రవి నాయక్, నాయకులు కావలి యాదయ్య, సత్యం రెడ్డి, హరిచంద్ర నాయక్, రాజు, వెంకటేష్, ఎర్ర పెంటయ్య, శ్రీను నాయక్, రమేష్, మేళ్లగూడ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. కొండన్నగూడ గ్రామానికి చెందిన నేతలు వెంకట్ రెడ్డి, సురేష్ గౌడ్, వై. శ్రీనివాస్ యాదవ్, అంజయ్య గౌడ్, యాదయ్య గౌడ్, మహిపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లేష్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

## శాంతమ్మ హత్య కేసును ఛేధించిన పోలీసులు

**ముగ్గురి నిందితుల అరెస్ట్**








జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 27:- కొడంగల్ నియోజకవర్గం నారాయణపేట జిల్లా మద్దూరు మండలం జాదరావుపల్లికి చెందిన గొయికల శాంతమ్మ మిస్సింగ్ అయినట్లు ఈ నెల 15వ తేదిన మద్దూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. విచారణ చేపట్టిన పోలీసులు గత రెండు రోజుల క్రితం నారాయణపేట జిల్లా జాజాపూర్ గ్రామం చెరువు దగ్గర ఒక మహిళా విగత జీవిగా పడిన విషయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం శాంతమ్మ గ గుర్తించరు. విచారణ వేగవంతం చేసిన పోలీసులు మృతదేహం గుర్తించిన రెండు రోజులలోనే హత్య కేసులో పురోగతి సాధించినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ఈ హత్య బంగారు ఆభరణాల కోసం పథకం ప్రకారం ఈ హత్య జోగు రాజు, బడుగుల భాస్కర్ లు చేసి నగలు జాజాపూర్ గ్రామానికి చెందిన కృష్ణకు అమ్మినట్లు విచారణలో తేలింది. దొంగిలించిన నగలను కొనుగోలు చేసిన కృష్ణను, నిందితులని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి తులం బంగారు నగలు, 50 తులాల వెండి ఆభరణాలు, రూ. 50 వేల నగదు, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన కోస్గి సీఐ సైదులు, మద్దూరు ఎస్ఐ శ్రీనివాసులు బృందాన్ని ఎస్పీ అభినందించారు. జిల్లాలో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, అనుమానాస్పద ఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం



ఆమనగల్లు, జులై 27(జర్నలిస్ట్ డైరీ) : రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో సోమవారం విత్తన మేళా ను ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేశారు. రైతులకు విత్తన మేళా సోమవారం నుండి బుధవారం వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ విత్తన మేళాలో కందులు, పెసర, మినుము, ఆముదాలు, కూరగాయల విత్తనాలు వంటి తక్కువ నీటి వసతితో తక్కువ కాల పరిమితి గల విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. కాబట్టి వరి సాగు చేసే రైతులు వరికి బదులు ఆరుతడి పంటలైన పెసర, మినుము, కందిలాంటి పంటలు సాగు చేసుకోవాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు నికిత, మీనాక్షి, రైతులు మరియు డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వంలో నినాదాల జోరు అధికం
# పాలనా ఫలితాలు పరిమితం

ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేయడం ప్రజాస్వామ్యంలో సహజం. అయితే రాజకీయ ప్రచారం, ఎన్నికల నినాదాలు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే సందేశాలు వాస్తవాల స్థానాన్ని భర్తీ చేయలేవు. ఏ ప్రభుత్వాన్నైనా లేదా ఏ ప్రతిపక్షాన్నైనా అంచనా వేయాలంటే భావోద్వేగాల కంటే ఆధారాలు, గణాంకాలు, విధానాల ఫలితాలు, ప్రజల జీవన ప్రమాణాలపై వాటి ప్రభావమే ప్రమాణం కావాలి. ఇటీవల విస్తృతంగా ప్రచారంలో ఉన్న "ప్రపంచమంతా భారత్ లేదా బీజేపీ ఓడిపోవాలని కోరుకుంటోంది" అనే వాదన కూడా ఇదే ప్రమాణంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొదట విదేశాలు లేదా అంతర్జాతీయ శక్తులు భారత ఎన్నికల్లో ఏకపక్షంగా ఒకే పార్టీ గెలవాలని లేదా ఓడిపోవాలని కోరుకుంటున్నాయనే వాదనకు ఇప్పటివరకు బలమైన, స్వతంత్ర ఆధారాలు అందుబాటులో లేవు. అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, కెనడా వంటి దేశాలు తమ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వంతో కలసి పనిచేస్తాయి. ప్రభుత్వం మారినా ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతూనే ఉంటాయి. అమెరికాతో రక్షణ, సెమీకండక్టర్లు, సాంకేతికత, వాణిజ్యం వంటి రంగాల్లో సహకారం పెరిగింది. అదే సమయంలో మానవ హక్కులు, మీడియా స్వేచ్ఛ, మైనారిటీల భద్రత వంటి అంశాలపై విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. విమర్శలను ఎన్నికల్లో ఒక పార్టీని ఓడించాలనే కుట్రగా పరిగణించడం వాస్తవాలను వక్రీకరించడం అవుతుంది. భారత్ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తున్న మాట కొంతమేరకు నిజమే. రక్షణ ఉత్పత్తుల విలువ గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. కానీ అదే సమయంలో భారత్ ఇప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుల్లో ఒకటిగా కొనసాగుతోంది. అందువల్ల విదేశీ ఆయుధ పరిశ్రమ మొత్తం భారత్ బలపడకూడదని చూస్తోందనే వాదనకు సరిపడే ఆధారాలు లేవు. వాస్తవానికి అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ వంటి దేశాలు భారత రక్షణ మార్కెట్లో భాగస్వాములుగానే ఉన్నాయి. ఆ దేశాల నుండి యుద్ధ విమానాలు, ఆయుధాల దిగుమతులు అధికంగా ఉన్నాయి. ఆయుధాల ఉత్పత్తిలో సాంకేతిక సహకారం రష్యా, ఇజ్రాయెల్ నుండి లభిస్తుంది. రామ మందిర నిర్మాణం బీజేపీకి ఒక ముఖ్య రాజకీయ, సాంస్కృతిక విజయంగా భావించబడుతుంది. అయితే ఇటీవల రామ్ మందిరంలో దేవుని బంగారం, వెండి, దేవుని వజ్రాల హారం, పెద్ద ఎత్తున భక్తుల ముడుపులు ఆలయ ట్రస్టు సభ్యుల నేతృత్వంలో దోపిడీ జరగటం, అయోధ్య రామమందిరం ప్రతిష్టను దిగజార్చింది. ఇప్పుడు భక్తుల రద్ధి తగ్గింది. భక్తుల కానుకలు, పరిసర ప్రాంతాల్లో వ్యాపారాల ఆదాయం కూడా తగ్గింది. రామ్ మందిర నిర్మాణం అన్ని భారతీయ వర్గాల ఏకాభిప్రాయ విజయంగా చెప్పలేం. కేవలం సుప్రీంకోర్టు తీర్పు మూలంగా జరిగింది. అలాగే ఆర్టికల్ 370 రద్దు తరువాత కాశ్మీర్‌లో ఉగ్రవాద ఘటనలు తగ్గినట్లు అధికారిక గణాంకాలు సూచించినప్పటికీ, రాజకీయ ప్రక్రియ, ప్రజాస్వామ్య ప్రతినిధిత్వం, నిర్బంధాలు, పౌర స్వేచ్ఛలపై అనేక ప్రశ్నలు దేశీయ, అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తబడ్డాయి. కాబట్టి ఒకే విధానాన్ని పూర్తిగా విజయంగా లేదా పూర్తిగా వైఫల్యంగా




చిత్రీకరించడం సరైన విశ్లేషణ కాదు. సీఏఏ అమలైంది కానీ జాతీయ పౌరుల నమోదు (ఎన్ఆర్సీ) దేశవ్యాప్తంగా ఇప్పటికీ అమల్లోకి రాలేదు. అందువల్ల "సీఏఏ/ఎన్ఆర్సీ పూర్తిగా అమలయ్యాయి" అనే వాదన కూడా వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. నూతన విద్యా విధానం కూడా సంస్కరణల దిశగా ఒక ప్రయత్నమే అయినప్పటికీ, రాష్ట్రాల అమలు సామర్థ్యం, నిధుల కొరత, డిజిటల్ అసమానత, ఉపాధ్యాయ శిక్షణ వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. ఇంకా చాలా రాష్ట్రాలలో అమలు కావడం లేదు. భారత్ ప్రపంచంలో నాలుగు నుంచి ఆరవ స్థానానికి పడిపోయింది. అయినా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఈ మధ్య కాలంలో ఎదగడం ఒక ముఖ్యమైన మైలురాయి. అయితే తలసరి ఆదాయం, నిరుద్యోగం, యువత ఉపాధి, మహిళల శ్రామిక భాగస్వామ్యం, ఆదాయ అసమానత వంటి సూచికల్లో ఇంకా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే వెనుకబడి ఉన్నాం అనే విషయాన్ని మర్చిపోకూడదు. జీడీపీ పరిమాణం పెరగడం ఒక్కటే ప్రజల జీవన ప్రమాణాలు సమానంగా మెరుగుపడ్డాయని ఆర్థిక శాస్త్రం నిరూపించదు. కరోనా సమయంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాల్లో ఒకదాన్ని నిర్వహించింది. ఇది పరిపాలనా పరంగా ఒక విశేష విజయం. అదే సమయంలో రెండో కరోనా అలలో ఆక్సిజన్ కొరత, ఆసుపత్రులపై ఒత్తిడి, మరణాల లెక్కలపై వచ్చిన వివాదాలు కూడా చరిత్రలో నమోదయ్యాయి. కాబట్టి విజయాలను మాత్రమే కాదు, వైఫల్యాలను కూడా గుర్తుంచుకోవాల్సిందే. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వే విద్యుదీకరణ, విమానాశ్రయాల విస్తరణ, డిజిటల్ చెల్లింపుల పెరుగుదల వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తుంది. అదే సమయంలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, పట్టణ-గ్రామీణ అసమానతల వంటి రంగాల్లో ఇంకా పెద్ద పెట్టుబడులు అవసరమని స్వతంత్ర అధ్యయనాలు సూచిస్తున్నాయి. జీఎస్టీ దేశవ్యాప్తంగా ఒకే పన్ను వ్యవస్థను తీసుకువచ్చింది. కానీ ప్రారంభ సంవత్సరాల్లో చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న సమస్యలు, తరచూ మారిన పన్ను రేట్లు, పరిహార నిధులపై రాష్ట్రాల అభ్యంతరాలు కూడా వాస్తవాలే. అదే విధంగా డీమానిటైజేషన్ నల్లధనాన్ని అరికడుతుందని ప్రకటించినప్పటికీ, రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం చలామణిలో ఉన్న దాదాపు మొత్తం కరెన్సీ బ్యాంకులకు తిరిగి వచ్చింది. అంటే ప్రభుత్వ ప్రచారంలో నిజం లేదని తెలుస్తోంది. డీమానిటైజేషన్ అనధికారిక రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని అనేక మంది ఆర్థిక నిపుణులు విశ్లేషించారు. "మంత్రిత్వ స్థాయిలో అవినీతి శూన్యం" అనే వాదనను కూడా జాగ్రత్తగా చూడాలి. పెద్ద అవినీతి కేసుల్లో కేంద్ర మంత్రులపై తీర్పులు లేకపోవడం ఒక విషయం అయితే, ఎన్నికల బాండ్ల వ్యవస్థపై సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, పారదర్శకతపై వచ్చిన విమర్శలు, దర్యాప్తు సంస్థల వినియోగంపై ప్రతిపక్షాల ఆరోపణలు మరోవైపు ఉన్నాయి. ఒకప్పుడు దేశంలో అవినీతి పరులు అని బీజేపీ ప్రభుత్వం ముద్ర పడిన వారంతా తదనంతర కాలంలో బీజేపీలో చేరి కొందరు రాజకీయ పదవులు పొందినందు వల్ల అవినీతి పూర్తిగా అంతరించిపోయిందని చెప్పడం కంటే, పారదర్శకతను కోల్పోయిన ఈడీ, ఐటీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థల నివేదికలు కూడా విశ్వసనీయతను కోల్పోయాయి. బీజేపీ ప్రభుత్వంలో "బాంబు పేలుళ్లు లేవు", "పాకిస్థాన్‌ను ఒక్క బులెట్ కూడా వేయకుండా దెబ్బతీశారు", "చైనాను నియంత్రించారు" వంటి రాజకీయ నినాదాలు కూడా అతిశయోక్తితో కూడుకున్నవే. ఉగ్రవాద ఘటనలు తగ్గిన ప్రాంతాలున్నప్పటికీ, సరిహద్దు ఉద్రిక్తతలు, గాల్వాన్ వంటి సంఘటనలు, పుల్వామ ఉగ్రవాద సంఘటనలు, భారత - చైనా సరిహద్దుల వివాదాలు ఇంకా పూర్తిగా పరిష్కారమవలేదు. విదేశాంగ విధానాన్ని విజయాల జాబితాగా లేదా వైఫల్యాల జాబితాగా కాకుండా అదొక నిరంతర ప్రక్రియగా చూడాలి. భారత్‌లో ఐఐటీలు, ఎయిమ్స్‌లు, తాగునీటి పథకాలు, ఆయుష్మాన్ భారత్, మొబైల్ తయారీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో నిజమైన పురోగతి కనిపిస్తోంది. అయితే ఈ విజయాలు కేవలం ఒకే పార్టీకి చెందినవి అని చెప్పడం కూడా సరైంది కాదు. అనేక రంగాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన, మిక్సిడ్ ఆర్థిక విధానాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగం కలిసి చేసిన మిశ్రమ కృషి ఫలితమే. చివరగా, "దేశాన్ని ప్రేమించడం అంటే కేవలం ఒకే ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం" అనే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. దేశభక్తి ఏ పార్టీకి గుత్తాధిపత్యం కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత అవసరమో, లోపాలు ఉంటే ప్రశ్నించడం కూడా అంతే అవసరం. విమర్శించే వారిని దేశద్రోహులుగా, మద్దతు ఇచ్చేవారిని మాత్రమే దేశభక్తులుగా విభజించడం ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తుంది. ఓటరు బాధ్యత ప్రచార సందేశాలను పునరావృతం చేయడం కాదు; ఆధారాలను పరిశీలించడం, వాగ్దానాలను ఫలితాలతో పోల్చడం, పాలనను ప్రశ్నించడం. ప్రజాస్వామ్యంలో బలమైన దేశాన్ని నిర్మించేది ఏకపక్ష నినాదాలు కాదు; వాస్తవాల ఆధారంగా తీసుకునే చైతన్యపూర్వక నిర్ణయాలే.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**
ramkishore.1504@gmail.com

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# నాగారం- దమ్మాయిగూడ రోడ్డు ను తక్షణమే వేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి....

**నాగారం, జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
నాగారం -- దమ్మాయిగూడ ప్రధాన రహదారిని తాత్కాలిక మరమ్మతులతో కాకుండా శాశ్వతంగా నాణ్యమైన రహదారిగా నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడవలెనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున సోమవారం జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. నాగారం -- దమ్మాయిగూడ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు నిత్యం నరకయాతనను మిగులుస్తోంది. ఈ రహదారిపై ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడు గుంతలు నీటితో నిండిపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఈ సమస్యపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం తప్ప, మన్నికైన రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో కొద్ది రోజులకే మళ్లీ అదే దుస్థితి ఏర్పడుతోంది. ప్రజల ప్రాణాల కంటే ఏ పని గొప్పది కాదు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, ప్రమాదాలు జరగకుండా ముందుగానే శాశ్వత చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతని వారు గుర్తు చేసారు.అందువల్ల తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున నాగారం -- దమ్మాయిగూడ ప్రధాన రహదారిని తాత్కాలికంగా కాకుండా పూర్తిస్థాయిలో శాశ్వత నాణ్యమైన రహదారిగా నిర్మించాలని, నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని,రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల భద్రత కోసం అవసరమైన తాత్కాలిక జాగ్రత్తలు తీసుకోవాలని.


Citizen Copy

GOVERNMENT OF TELANGANA

Medchal Malkajigiri District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DMDCL27072600093 | Grievance Date: | 27-JUL-2026 |
| Citizen Name: | G Kamalakar | Mobile No.: | 9399944425 |
| Gist of Grievance: | Requested to renovate the damaged road | | |

Your Grievance has been forwarded to the **eDM - Medchal Malkajigiri - Medchal Malkajigiri** for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required

*"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."*

రహదారి పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతలో రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని. ప్రజలు తాత్కాలిక గుంతల పూడ్చివేతను కాదు, శాశ్వత రహదారిని కోరుతున్నారని.

ప్రజలు హామీలు కాదు, పనులు కోరుతున్నారని.ప్రజల ప్రాణాలు అమూల్యమైనవని. వాటిని కాపాడటం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యతని, కావున ఈ వినతిపత్రాన్ని అత్యవసరంగా పరిగణించి, నాగారం -- దమ్మాయిగూడ ప్రధాన రహదారిని శాశ్వతంగా నిర్మించి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున విజ్ఞప్తి చేసారు.

# పోలీసు సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులకు కీలక ఆదేశాలు

**- నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 27 (జర్నలిస్ట్ డైరీ) :**
ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు తీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు పలు కీలక సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ (యూఐ) కేసులను సాంకేతిక ఆధారాలతో త్వరగా ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్, ఈ-సాక్షి వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని డా. తరుణ్ జోషి సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.కాన్హా శాంతివనాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్
అనంతరం పోలీస్ కమిషనర్ కాన్హా శాంతివనాన్ని సందర్శించారు. అక్కడి నిర్వాహకులతో సంస్థ కార్యకలాపాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ కొంత సమయం గడిపారు. చిన్నారులను ప్రోత్సహిస్తూ వారి విద్య, విలువలు, మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జోన్ డీసీపీ శ్రీమతి శిరీష, ఏసీపీ శ్రీ ఎస్. లక్ష్మీనారాయణ, నందిగామ ఎస్‌హెచ్ఓ శ్రీ బి. వీరబాబు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కుషాయిగూడ బస్ స్టాప్‌ను కాపాడుకుందాం...

**బారికేడ్లను వెంటనే తొలగించాలి**



**నాగారం, జూలై 27:-(జర్నలిస్ట్ డైరీ)**
కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద బస్సులు తిరగకుండా రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల ప్రజలు, వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ బారికేడ్ల కారణంగా కుషాయిగూడకు వచ్చే ముషీరాబాద్ డిపో 3ఖ బస్సులు ఇప్పటికే నిలిపివేయబడ్డాయి. ఇప్పుడు కుషాయిగూడ డిపోకు చెందిన 3ఖ సర్వీసులు కూడా నేటి నుంచి నిలిపివేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, ఉప్పల్ నుంచి వచ్చే 117 బస్సులను కూడా త్వరలో నిలిపివేసే అవకాశమున్నట్లు సమాచారం అందుతోంది.ఇంకా తెలియకుండా చాలా బస్సులు ఇప్పటికే సర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం.ఇలా కొనసాగితే దాదాపు 50 సంవత్సరాల చరిత్ర కలిగిన కుషాయిగూడ బస్ స్టాప్ తన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే బారికేడ్ల కారణంగా స్థానిక వర్తకులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతూ ఆందోళన చెందుతున్నారు.కాబట్టి ట్రాఫిక్ శాఖ ఉన్నతాధికారులకు మా విజ్ఞప్తి,కుషాయిగూడ రోడ్డుకు బస్సులు తిరగకుండా అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే తొలగించి, బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకుని, కుషాయిగూడ ప్రజలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారులకు న్యాయం చేయాలి.
కుషాయిగూడ బస్ స్టాప్ మన ప్రాంత చరిత్ర... దానిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని
సామాజిక కార్యకర్త,
ప్రధానకార్యదర్శి,
కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్.
అధ్యక్షుడు, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కు చెందిన పనగట్ల చక్రపాణి గౌడ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఆమనగల్లు ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సంతోష్ కుమార్ రెడ్డి



**ఆమనగల్లు,జూలై27 (జర్నలిస్ట్ డైరీ) :**
ప్రజలకు నాణ్యమైన పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే ప్రతి పోలీస్ అధికారి ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆమనగల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆమనగల్లు సబ్ ఇన్స్పెక్టర్ గా ఏ సంతోష్ కుమార్ రెడ్డి సోమవారం ఆమనగల్ పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ఓ ఎస్. వెంకటేశ్వర్లు కు రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. గతంలో చేవెళ్ల,శంకర్ పల్లి పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా సేవలందించిన సంతోష్ కుమార్ రెడ్డికి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చట్ట పరిరక్షణ, శాంతి భద్రతల నిర్వహణ ప్రజా సమస్యలపై సత్వర స్పందనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్నేహపూర్వక పోలీస్ సింగ్ తో పాటు పెండింగ్ కేసుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. నూతన ఎస్సై చేరికతో ఆమనగల్ పోలీస్ స్టేషన్ లో పోలీస్ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందుతాయని స్టేషన్ ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# ప్రజావాణి కార్యక్రమంలో ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్



**మిడ్జిల్, జులై 27, (జర్నలిస్ట్ డైరీ) :**
ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ , సంబంధిత పోలీసు అధికారులు వాటిపై వెంటనే స్పందించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటూ బాధితులకు న్యాయం జరిగేలా తక్షణమే పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసు శాఖను సంప్రదించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# పడకల్ గ్రామంలో జలసిరిపై గ్రామసభ సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో**



**తలకొండపల్లి, జులై 27 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జల సిరి పై గ్రామసభ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తలకొండపల్లి ఎంపీడీవో సీతారామమ్మ, మాట్లాడుతూ.. వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను రైతులను అప్రమత్తం చేయడం కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని అని గ్రామసభ నిర్వహించి గ్రామ ప్రజలను తమ తమ వాకిళ్లలో ఇంకుడు గుంతలు తీసుకోవాలని, మరియు ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులందరూ పాంపాండ్ కోరారు అప్లై చేసుకోవాలని చెప్పారు... అగ్రికల్చర్ ఏఈఓ త్రిలోక్య మాట్లాడుతూ వర్ష బావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆకుతడి పంటలు వేసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు, బిఎల్వోలు, బిఎల్ఎలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# బిజినెస్

## భారీగా తగ్గిన క్రూడాయిల్ ధరలు..
## గ్లోబల్ మార్కెట్లలో ఊరట




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఇటీవల భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా వరుసగా పెరిగిన ముడిచమురు ధరలు తాజాగా గణనీయంగా పడిపోవడంతో గ్లోబల్ మార్కెట్లకు కొంత ఊరట లభించింది. ముఖ్యంగా అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు సద్దుమణుగుతున్నాయనే సంకేతాలు వెలువడటంతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 88.74 డాలర్ల్లు వద్ద కొనసాగుతుండగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు 83.26 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కేవలం నాలుగు రోజుల క్రితం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100.80 డాలర్ల స్థాయికి చేరుకోవడం గమనార్హం. అయితే ఆ తర్వాత అంతర్జాతీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో ధరలు వేగంగా దిగివచ్చాయి. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇరాన్‌పై సైనిక చర్యలను అమెరికా తాత్కాలికంగా నిలిపివేసి, దౌత్యపరమైన చర్చలకు ప్రాధాన్యం ఇస్తోందన్న వార్తలు పెట్టుబడిదారుల్లో సానుకూల సంకేతాలను పంపించాయి. దీంతో సరఫరాపై నెలకొన్న ఆందోళనలు తగ్గి, ముడిచమురు ధరలపై ఒత్తిడి ఏర్పడినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ఉన్న ఆందోళనలు, చమురు డిమాండ్ మందగించే అవకాశాలపై వస్తున్న అంచనాలు కూడా ధరల పతనానికి మరో కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు కొంత మేర ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. క్రూడాయిల్ ధరలు తగ్గితే చమురు మార్కెటింగ్ సంస్థలపై వ్యయభారం తగ్గడంతో పాటు, భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. అయితే దేశీయ ఇంధన ధరలు అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, రూపాయి-డాలర్ మారకం విలువ తదితర అంశాలపై కూడా ఆధారపడి ఉంటాయని వారు గుర్తు చేస్తున్నారు. రానున్న రోజుల్లో అమెరికా--ఇరాన్ సంబంధాలు, ఓపెక్ దేశాల ఉత్పత్తి విధానాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ఎలా మారతాయన్న దానిపై క్రూడాయిల్ ధరల దిశ ఆధారపడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.


# పసిడి ప్రియులకు మరోసారి షాక్

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు..



**హైదరాబాద్**
వరుస రోజులుగా హెచ్చుతగ్గులు నమోదవుతున్న బంగారం ధరలు మరోసారి పెరిగాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న పసిడి ప్రియులకు మరోసారి నిరాశ ఎదురైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల పెరుగుదల, డాలర్ మారకం విలువలో మార్పులు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు పైకి ఎగబాకుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం నమోదైన తాజా ధరలు కొనుగోలుదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజా ధరల ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.930 పెరిగి రూ.1,45,860కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.850 పెరిగి రూ.1,33,700 వద్ద కొనసాగుతోంది. ఒకే రోజులో బంగారం ధరల్లో ఈ స్థాయిలో పెరుగుదల నమోదుకావడంతో నగల కొనుగోలును వాయిదా వేసుకోవాలని భావిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇక వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద ఎలాంటి మార్పు లేకుండా నిలిచింది. గత కొన్ని రోజులుగా వెండి ధరల్లో కూడా హెచ్చుతగ్గులు కనిపించినప్పటికీ, సోమవారం మాత్రం స్థిరంగా ఉండటం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలు, పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపడం వంటి అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అదనంగా, డాలర్ మారకం విలువలో మార్పులు, అంతర్జాతీయ వడ్డీ రేట్లపై అంచనాలు కూడా బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, వివాహాల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో బంగారానికి డిమాండ్ పెరిగే అవకాశముందని వ్యాపారులు భావిస్తున్నారు. ఈ డిమాండ్ కొనసాగితే రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశాన్ని కూడా వారు కొట్టిపారేయడం లేదు. అయితే అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను బట్టి ధరల్లో మళ్లీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని సూచిస్తున్నారు. బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు ప్రతి రోజు ధరలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆభరణాలు కొనుగోలు చేసే సమయంలో బంగారం ధరతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్‌టీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలు, పట్టణాల్లో స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, నగల దుకాణాల విధానాలను బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. కొనుగోలు చేసే ముందు స్థానిక బులియన్ మార్కెట్ లేదా సంబంధిత జ్యువెలరీ దుకాణంలో తాజా ధరలను తెలుసుకోవడం మంచిదని వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి.

## వన్‌ప్లస్ మూతపడుతోందా?



వన్‌ప్లస్ త్వరలో ప్రపంచ మార్కెట్ నుండి నిష్క్రమించనుందని నివేదికలు అందుతున్నాయి. ఈ సంస్థ చైనా నుండి దశలవారీగా వైదొలగడానికి సిద్ధమవుతోంది. ఈ సంస్థ మొదట అమెరికా, యూరప్ నుండి వైదొలుగుతుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక ద్వారా తెలుస్తోంది. ఈ నివేదిక ప్రకారం, భారతదేశం నుండి తక్షణ ఉపసంహరణ ఉండదు. అయితే, వచ్చే ఏడాది నాటికి ఈ సంస్థ భారతదేశం నుండి తన కార్యకలాపాలను ఉపసంహరించుకుంటుంది. వన్‌ప్లస్ మాతృ సంస్థ అయిన 'గ్వాంగ్‌డాంగ్ ఒప్పో మొబైల్ టెలికమ్యూనికేషన్స్ కార్పొరేషన్ లిమిటెడ్' చేపడుతున్న విస్తృత పునర్నిర్మాణంలో ఈ చర్య ఒక భాగం.ఒప్పో యాజమాన్యంలోని మరో స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన రియల్‌మీ కూడా భారీ మార్పులకు సిద్ధమవుతోంది. రియల్‌మీ చైనా దేశీయ మార్కెట్ నుండి నిష్క్రమించాలని యోచిస్తున్నట్లు కూడా ఆ నివేదిక పేర్కొంది.వన్‌ప్లస్ ఫోన్ షిప్‌మెంట్లు సుమారు 20 శాతం తగ్గాయి. వన్‌ప్లస్ ఫోన్ షిప్‌మెంట్లు 2024లో సుమారు 17 మిలియన్ల (1.7 కోట్ల) యూనిట్ల నుండి 13 నుండి 14 మిలియన్ల యూనిట్లకు తగ్గాయి. ఒప్పో వన్‌ప్లస్‌లో సుమారు 14 బిలియన్ల అమెరికన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టింది. అయితే, ఇంత భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టినప్పటికీ, ఆ కంపెనీ నిరంతర నష్టాలను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. దీని నేపథ్యంలో ఆ కంపెనీ ఖర్చులను తగ్గించుకునే చర్యలను ప్రారంభించింది. ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపాలో తన మార్కెట్ వాటాను పెంచుకోవడానికి వన్‌ప్లస్ ఇబ్బంది పడుతోందని సమాచారం. ప్రారంభంలో వృద్ధి సాధించిన తర్వాత, ఆ కంపెనీ నష్టాలను చవిచూసింది. అమ్మకాలు మందగించడం కూడా ఈ బ్రాండ్‌కు ఒక ఎదురుదెబ్బగా మారింది. వన్‌ప్లస్ ఓపెన్ 2, వన్‌ప్లస్ 15ఎస్ వంటి ఫోన్‌లను రద్దు చేసినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ఆ కంపెనీ తన యూఎస్ ప్రధాన కార్యాలయాన్ని మూసివేస్తోందని, యూరప్‌లో కార్యకలాపాలను తగ్గిస్తోందని, టీ-మొబైల్‌తో భాగస్వామ్యాన్ని ముగిస్తోందని కూడా ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై వన్‌ప్లస్ గానీ, ఒప్పో గానీ అధికారికంగా స్పందించలేదు.

# స్పోర్ట్స్

## జింబాబ్వే పర్యటనలో కోచ్‌గా లక్ష్మణ్ హిట్..
## గంభీర్‌పై వేటు తప్పదా..!




ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ అనంతరం భారత జట్టు గాడీలో పడేనా? అనే ప్రశ్నలకు జింబాబ్వే పర్యటనతో జవాబు దొరికింది. వరసగా రెండు సిరీస్‌లో కోల్పోయిన బాధను దిగమింగుతూ శ్రేయాస్ అయ్యర్ సేన.. ఆఫ్రికా జట్టును క్లీన్‌స్వీప్ చేసింది. వారం క్రితం చేజారిన నంబర్ 1 ర్యాంకును కైవసం చేసుకుంది టీమిండియా. అలాఅనీ ఈ క్రెడిట్ అంతా హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ది కాదు. అప్పుడప్పుడు టీ20 జట్టుకు కోచ్‌గా వ్యవహరించే వీవీఎస్ లక్ష్మణ్ హయాంలో అయ్యర్ సేన సిరీస్‌ను 3-0తో గెలిచింది. దాంతో.. ఈ ఫార్మాట్‌లో లక్ష్మణ్‌ను కోచ్‌గా కొనసాగిస్తారా? అనే చర్చ మొదలైంది.టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో భారత జట్టుకు వైట్‌వాష్ అవమానం ఎదురైంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మార్గనిర్దేశం చేసినా కుర్రాళ్లతో నిండిన జట్టు పరిస్థితులను అర్థం చేసుకోలేక.. నిలకడను ప్రదర్శించలేక సిరీస్‌లు కోల్పోయింది. ఫలితంగా.. గౌతీని టీ20 కోచ్‌గా తప్పించాలని, మళ్లీ సూర్యకుమార్ యాదవ్‌కే పగ్గాలు అప్పగించాలని డిమాండ్లు వచ్చాయి. అయితే.. వారంలోనే పరిస్థితి మారిపోయింది. వరసగా రెండు సిరీస్‌లు, నంబర్ 1 ర్యాంక్ కోల్పోయిన టీమిండియా మూడు మ్యాచుల సిరీస్‌లో 3-0తో జింబాబ్వేను చిత్తు చేసింది. కెప్టెన్ అయ్యరే అయినప్పటికీ కోచ్ మాత్రం వీవీఎస్ లక్ష్మణ్.మూడో టీ20లో జింబాబ్వేపై 35 పరుగుల విజయం అనంతరం కెప్టెన్ అయ్యర్ డ్రెస్సింగ్ రూమ్‌లో లక్ష్మణ్‌పై ప్రశంసలు కురిపించాడు. 'మేము ఏ పొరపాట్లు చేయలేదు. క్యాచ్‌లు వదలేయడం చాలా వరకూ తగ్గింది. సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడంలో సహాయక సిబ్బందితో కలిపి జట్టులోని ప్రతిఒక్కరూ ఎంతో కృషి చేశారు. మమ్మల్ని ఎంతగానో ప్రేరేపించినందుకు, మాలో స్ఫూర్తి నింపినందుకు లక్ష్మణ్ సర్‌కు ధన్యవాదాలు. మైదానంలో దిగిన ప్రతిసారి వంద శాతం పోరాడాలని మీరు చెప్పారు. అందుకు మీకు కృతజ్ఞతలు' అని అయ్యర్ పేర్కొన్నాడు.భారత టీ20 కోచ్‌గా లక్ష్మణ్ విజయవంతమవుతున్నాడు. ఇదివరకు శ్రీలంక పర్యటనలోనూ లక్ష్మణ్ జట్టును విజేతగా నిలిపాడు. దాంతో.. అతడికే టీ20 కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అంతేకాదు 2027 వన్డే ప్రపంచకప్‌తో హెడ్‌కోచ్‌గా గంభీర్ కాంట్రాక్ట్ ముగియనుంది. దాంతో.. తదుపరి టీమిండియా కోచ్‌గా లక్ష్మణ్‌ను నియమించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఈ మాజీ సొగసరి ఆటగాడు మాత్రం అందుకు సిద్ధంగా లేనని చెబుతున్నాడు. గౌతం గంభీర్, సీనియర్ కోచింగ్ సిబ్బంది అందుబాటులో లేనప్పుడు నేను కోచ్‌గా ఉంటానంతే అని లక్ష్మణ్ వెల్లడించాడు.

## అదరగొడుతున్న యువ బాక్సర్లు..
## క్వార్టర్ ఫైనల్లో అంకుశ్, సచిన్..!



కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు చెలరేగుతున్నారు. సూపర్ పంచ్‌లతో ప్రత్యర్థులను ఓడిస్తున్న అంకుశ్ , సచిన్ సివాచ్‌లు పతక వేటలో దూసుకెళు న్నారు. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ క్వార్టర్ ఫైనల్ చేరగా.. 60 కిలోల ఇంగ్లండ్ బాక్సర్‌ను చిత్తు చేసిన సచిన్ సైతం క్వార్టర్స్ బెర్తు సాధించాడు. దాంతో, వీరిద్దరూ మరో బౌట్ గెలిచారంటే కనీసం కాంస్యం సొంతమవుతుంది.అయితే.. వీరు మాత్రం పసిడి పతకమే తమ లక్ష్యమంటున్నారు.గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 80 కిలోల విభాగంలో అంకుశ్‌లు క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టారు. సోమవారం జరిగిన 16వ రౌండ్ ఇంగ్లండ్ బాక్సర్ విలియం హెవిట్‌ను సచిన్ చిత్తు చేశాడు. ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడిన సచిన్ స్వర్ణం గెలవడమే తన లక్ష్యం అంటున్నాడు. 'కోచ్ మాటలు విన్న తర్వాత నేను పుంజుకున్నాను. నా లక్ష్యం పతకం గెలవడమే. అది కూడా గోల్డ్ మెడల్. టోర్నీ ఆరంభం నుంచి నేను పసిడి కోసమే పోరాడుతున్నా. తొలి రెండు మ్యాచ్‌లు కష్టంగా గట్టెక్కాను. తదుపరి బౌట్‌లకు నేను పక్కాగా సిద్ధమవుతా' అని సచిన్ మీడియాతో వెల్లడించాడు.

**ఏకపక్ష పోరులో**
మరో పదహారో రౌండ్ మ్యాచ్‌లో హర్యానాకు చెందిన అంకుశ్ ధాటికి జలాన్ జాన్(అంటిగ్వా) చేతులెత్తేశాడు. 80 కిలోల విభాగంలో పోటీపడిన అంకుశ్ ఆరంభం నుంచి జలాన్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. దాంతో, భారత బాక్సర్ 5-0తో గెలుపొందాడు. ఏకపక్ష పోరులో సూపర్ విక్టరీ కొట్టిన ఈ పొడగరి బాక్సర్ అలవోకగా క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. సెమీస్ చేరితో చాలు అంకుశ్ దేశానికి కనీసం కాంస్యం అందించే అవకాశముంది.

## ఒలింపిక్ విజేతకు షాకిచ్చిన ఇషా..


### పసిడితో మెరిసిన హైదరాబాదీ..!



ప్రతిష్ఠాత్మక ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత యువ షూటర్ ఇషా సింగ్ సంచలనం సృష్టించింది. హంగ్జూ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఒలింపిక్ విజేత మనూ భాకర్ ను ఓడించి పసిడి పతకం కొల్లగొట్టిందీ హైదరాబాది. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో మనూ కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచిన 21 ఏళ్ల ఇషా.. పోడియం మీద సగర్వంగా స్వర్ణ పతకం స్వీకరించింది. మెగా ఈవెంట్లో నిరాశపరిచిన మనూ భాకర్ కాంస్యంతో సరిపెట్టుకుంది.షూటింగ్‌లో గొప్పగా రాణిస్తున్న ఇషా సింగ్ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటింది. ఇటీవలే మ్యూనిచ్‌లో అదిరే ప్రదర్శనతో రికార్డు పుస్తకాల్లో చేరిన ఇషా ఈసారి చైనాలోని హంగ్జూ వేదికగా జరుగుతున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో పసిడి వెలుగులు విరజిమ్మింది. మహిళల25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత్‌కే చెందిన ఒలింపిక్ విజేత మనూ భాకర్‌ను ఓడించి పసిడి పతకం గెలచుకుంది ఇషా. 'మ్యూనిచ్‌లో పతకం గెలిచినందున ఈ మ్యాచ్‌లో నాపై ఒత్తిడి ఎక్కువ ఉంది. ఇలాంటి సమయంలో మనలోని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాల్సి వస్తుంది. ఇక్కడే రెండేళ్ల క్రితం ఆసియా క్రీడల్లో పాల్గొన్న అనుభవం.. నాలుగు మెడల్స్ సాధించిన జ్ఞాపకాలు నాకు మరింత బలమయ్యాయి' అని ఇషా పేర్కొంది. త్వరలో జరుగనున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, ఆసియా క్రీడలకు ముందు గోల్డ్ మెడల్ సాధించడం ఇషా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది.

# ‘రాకా’లో అల్లు అర్జున్ వైల్డ్ ఎంట్రీ..

## భారీ యాక్షన్ ఎపిసోడ్‌తో కొత్త షెడ్యూల్‌కు సిద్ధమైన అట్లీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ -- స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఇప్పుడు కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది.ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. ‘పుష్ప’ తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ‘రాకా’లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ‘రాకా’ కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ స్టార్‌డమ్, అట్లీ మాస్ టేకింగ్, భారీ తారాగణం, గ్రాండ్ యాక్షన్ సీక్వెన్స్‌లు కలిసి ‘రాకా’ను ఇండియన్ సినిమా చరిత్రలో మరో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# చీరకట్టులో హాట్ బ్యూటీ మానస వారణాసి..

# ది ప్యారడైజ్ నుంచి బ్లాస్టింగ్ అప్‌డేట్..


## -కొత్త రిలీజ్ డేట్‌తో రానున్న టీజర్



న్యాచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దసరా వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా మంచి బజ్ ఏర్పడింది. తాజాగా ఈ సినిమా గురించి దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ‘ది ప్యారడైజ్’ షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. చిత్రబృందం రాత్రింబవళ్లు శ్రమిస్తూ షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నట్లు సమాచారం. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి సన్నివేశాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.ఇటీవల విడుదలైన ‘ఆయా షేర్’ ప్రమోషనల్ కంటెంట్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ వీడియో ఇప్పటికే 20 కోట్ల (200 మిలియన్) వ్యూస్ దాటిన సందర్భంగా ఆనందం వ్యక్తం చేసిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, అభిమానులకు మరో సర్‌ప్రైజ్ ప్రకటించారు. త్వరలోనే ‘ది ప్యారడైజ్’ నుంచి ఓ బ్లాస్టింగ్ టీజర్ విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, ఆ టీజర్‌లోనే సినిమా కొత్త విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో నాని అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో నాని సరసన కాయదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయాల్, సీనియర్ నటుడు మోహన్ బాబు, తనికెళ్ల భరణి, సంపూర్ణేష్ బాబు, బాబు మోహన్, సోనాలి కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ విభిన్న తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న ‘ది ప్యారడైజ్’ పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలు, విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దసరా తర్వాత నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ మరోసారి మ్యాజిక్ చేయబోతుందనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పుడు అందరి దృష్టి త్వరలో విడుదల కానున్న టీజర్‌పైనే ఉంది. కొత్త రిలీజ్ డేట్‌తో పాటు టీజర్ ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# పారితోషికంగా 20కోట్లు?



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోని టాప్ 5 హీరోయిన్లలో సాయిపల్లవి కచ్చితంగా ఉంటారు. ఇప్పటివరకూ సాయిపల్లవి రిజక్ట్ చేసిన సినిమాలు ఉన్నాయి గానీ, సాయిపల్లవిని రిజక్ట్ చేసిన సినిమాలు లేవు. దటీజ్ సాయిపల్లవి. ఆమెను మెప్పించాలంటే ముందు మంచి కథతో వెళ్లాలనేది దేశవ్యాప్తంగా ఉన్న దర్శకనిర్మాతల మాట.కథకు, పాత్రకూ తొలిప్రాధాన్యతనిచ్చే సాయిపల్లవి.. అసలు పారితోషికం ఎంత తీసుకుంటుంది? అనేది మాత్రం చాలామందికి తెలీదు. కానీ ప్రస్తుతం బీటౌన్ సమాచారం ప్రకారం నితేష్ తివారీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న ‘రామాయణ’ చిత్రానికి రెండు భాగాలకు గాను రూ.20 కోట్లను ఆమె రెమ్యునరేషన్‌గా అందుకుంటున్నదని తెలిసింది. అంటే సినిమా పదికోట్లన్నమాట. ఈ స్థాయి పారితోషికం అందుకునే తారలు ఇండియాలో అరుదు.

# పొలిమేర 3లో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా..

## మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్‌తో పెరిగిన అంచనాలు!

టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ‘పొలిమేర’ ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు ‘పొలిమేర 3’ పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, ‘యాక్షన్ కింగ్’ అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా “హాష్టీఅశీల వీవవ్ం్రాశీషవతీ” అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.అర్జున్ ఎంట్రీతో ‘పొలిమేర 3’ కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన ‘మా ఊరి పొలిమేర’ ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. ‘పొలిమేర 2’ విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన ‘బ్లాస్ట్’ చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో మంచి విజయాన్ని అందుకుంది. యాక్షన్ సన్నివేశాల్లో అర్జున్ చూపించిన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను మెప్పించాయి.ఇలాంటి సమయంలో ఆయన ‘పొలిమేర 3’లో భాగం కావడం సినిమాకు మరింత బలం చేకూర్చే అంశంగా భావిస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465